
సాక్షి
బాపట్ల
శనివారం । 14 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.9865 టీఎంసీలు. ఎగువ నుంచి 1,945 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4,200 వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1216 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. వీటిని వేర్వేరు కాల్వలకు పంపిణీ చేశారు.

జీరో కరోనా

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.



న్యూస్‌రీల్

ఆర్టీసీ, రైల్వేస్టేషన్లలో గుంటూరు ఎస్పీ తనిఖీ



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ శుక్రవారం రాత్రి గుంటూరు రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ఏయే ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు అధిక సంఖ్యలో ఉన్నారు, వారి రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేసిన బస్‌ల రాకపోకలు వివరాలను ఆర్టీసీ అధికారులు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా హైదరాబాద్, తిరుపతి, వైజాగ్, బెంగళూరు తదితర పట్టణాల వైపు వెళ్లే ప్లాట్‌ఫాంల వద్ద వచ్చే, పోయే బస్‌ల వివరాలను తెలియజేశారు. ఎవరెవరూ వెళ్తున్నారు, ఏ పట్టణాలకు వెళ్తున్నారంటూ ప్రయాణికులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. గుంటూరు, పల్నాడు వైపు వెళ్లే ప్లాట్‌ఫాంలపై కలియ తిరిగారు. పోలీస్ ఔట్‌పోస్ట్ (ఓపీ) పోలీస్‌స్టేషన్ ను పరిశీలించారు. ఓపీలో ఎంత మంది విధుల్లో ఉంటున్నారనేది తూర్పు డీఎస్పీ సీతారామయ్య ఎస్పీకి వివరించారు. అనంతరం గుంటూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లి గుంటూరు నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లే రైళ్ల వివరాలను రైల్వేస్టేషన్ అధికారులు ఎస్పీకి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రద్దీ వేళల్లో ప్రయాణికులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పూర్తిస్థాయిలో రైళ్లు, ఆర్టీసీ బస్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రైల్వేస్టేషన్‌లో, ఆర్టీసీ బస్టాండ్‌లో దిగే ప్రయాణికులతో మంచి మెలగాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. ఏ ఒక్కరూ వద్ద అధిక చార్జీలు వసూలు చేయవద్దన్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ శ్రీనివాసరావు (క్రైం), తూర్పు డీఎస్పీ సీతారామయ్య, కొత్తపేట పీఎస్ సీఐ శ్రీనివాసుల రెడ్డి, సీసీఎస్ సీఐలు వెంకన్న చౌదరి, బెల్లం శ్రీనివాస్, ఎస్‌బీ సీఐ నరసింహ, తూర్పు ట్రాఫిక్ సీఐ ఇస్సార్ బాషా, ఎస్ఐలు పాల్గొన్నారు.


మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి రివైజ్డ్ ఫైనల్ మెరిట్ లిస్టును శుక్రవారం విడుదల చేశారు. ఫైనల్ మెరిట్ లిస్టును ఈనెల7న విడుదల చేయగా, 40 మంది అభ్యర్థులు వివిధ అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో, తిరిగి ఫైనల్ మెరిట్ లిస్టును శుక్రవారం విడుదల చేశారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రివైజ్డ్ ఫైనల్ మెరిట్ లిస్టును సీఎఫ్ డబ్ల్యూ వెబ్‌సైట్‌లో చూడాలని ఇన్‌చార్జ్ ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ తెలిపారు.

వైద్యులకు నియామక ఉత్తర్వులు


గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 11 మంది ఎంబీబీఎస్ వైద్యులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించి నియామకపు ఉత్తర్వులు జారీచేసినట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ జె. హనుమంతురావు తెలిపారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 575.50 అడుగుల వద్ద ఉంది. ఇది 270.3735 టీఎంసీలకు సమానం. కుడికాలువకి 8,067, ఎడమకాలువకు 6,634, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 17,304, ఎస్ ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 34,725 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 23,119 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 850.00 అడుగుల వద్ద ఉంది. ఇది 79.9890 టీఎంసీలకు సమానం.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1500, గరిష్ట ధర రూ.2200, మోడల్ ధర రూ.1700 వరకు పలికింది.

పల్లెగూటికి పండగొచ్చింది

- అంతటా సంక్రాంతి శోభ...
- బంధువుల రాకతో తెలుగు లోగిళ్లు కళకళ
- సంబరాల్లో మంత్రి రజిని

బాపట్ల టౌన్: పుష్యం మంచు తెరలు ఇంకా విడిపోనేలేదు...తూరుపుపొద్దున సూరీడు బద్ధకంగా ఒళ్లు విరుస్తున్నాడు. తెలుగు లోగిళ్లు మాత్రం అప్పటికే ముగ్గులతో మెరుస్తున్నాయి. మధ్యన గొబ్బెమ్మలు తమను చూడమన్నట్టు కనిపిస్తున్నాయి. ఇది ధనుర్మాసంలో కనిపించే దృశ్యం.. ఊరి కంటే ముందు వాకిలి మెలకువ తెచ్చుకుంటుంది. గోమయంతో నిండారా స్నానం చేసి పచ్చటి కాంతు లీనుతుంది. ముచ్చటైన ముగ్గులతో ముస్తాబై, పసుపు కుంకుమలను అద్దుకుని, గొబ్బెమ్మలు ఆభరణాలుగా అందరినీ పలకరిస్తుంటా యి. 'హరిలోరంగ హరి' అంటూ హరిదాసులు, 'అయ్యవారికి దండమెట్టు' అంటూ డూడూ బసవన్నలు పొద్దున్నుంచి ఊరిని చుట్టేస్తారు. ఈ అద్భుతమంతా సంక్రాంతి శోభదే సుమా! సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించేదీ, ఉత్తరాయ పుణ్యకాలంలోకి అడుగిడేదీ సంక్రాంతి రోజే. పురాతన పరంపరం నుంచి కొత్తదనానికి పరిణితి చెందటమే సంక్రమణం. అన్ని పండుగలకు చాంద్రమానం ఆధారం అయితే, సంక్రాంతికి సౌరమానం ఆధారం. ఈ మాసంలో సూర్యుడు ఉత్తరాయణ పథంలోకి పయనమవుతాడు. అందుకే దీన్ని ఉత్తరాయణ పుణ్యకాలం అని పిలుస్తారు. సంక్రాంతి మూడురోజుల పండుగ. తొలిరోజున భోగి. మర్నాడు సంక్రాంతి, తర్వాతిరోజు కనుమ జరుపుకుంటారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యపు రాశులు ఇంటికి చేరాక వచ్చే తొలి పండుగ. రైతులు, రైతుకూలీలు సంతోషంగా ఉంటారు. ఎక్కడెక్కడో ఉండే కుటుంబసభ్యులు, బంధుమిత్రులు తప్పనిసరిగా వస్తారు.

కొత్త అల్లుళ్లకు ఉన్నంతలో రాచమర్యాదలు జరిగే సందర్భమిది. ఉత్తరాయణ పుణ్యకాలం పితృదేవతలకి ఆరాధనా కాలం. ప్రతీ సంక్రమణకీ పితృదేవతలకి తర్పణాలు ఇవ్వాలి. మిగిలిన 11 సంక్రమణలకు ఇచ్చినా ఇవ్వకున్నా మకర సంక్రమణం రోజున తప్పకుండా ఇవ్వాలి. ఆరోజున ముఖ్యంగా అరిసెలు చేస్తారు. అరిసెలు పితృదేవతలకు ఏడాదికి సరిపడా భక్ష్యమని అంటారు.



సంక్రాంతి అనగానే కళకళలాడే పల్లెలే కనుల ముందు నిలుస్తాయి. రంగు రంగుల రంగవల్లులు... గాలి పటాలు...కోడి పందేలు.. గంగిరెద్దు మేళాలు.. బుడబుక్కలవారు.. హరిదాసులు..జంగమదేవరలు... ప్రకృతితో సహజీవనం చేసే అసలైన పండుగ సంక్రాంతి. కొత్త పంటలతో, వంటలతో పరిమళిస్తుంది. అనుబంధాలు, ఆత్మీయతలు పెంచే పండుగల్లో ముఖ్యమైంది సంక్రాంతి. సంక్రాంతి పెద్ద పండుగ మాత్రమే కాదు... పెద్దల పండుగ కూడా!

కో ఢీ

కోస్తా జిల్లాల్లో కోడి పందేలు లేని సంక్రాంతిని ఊహించలేం. ఆంక్షలున్నా, మన సంస్కృతి, సంప్రదాయంలో భాగమైన కోడిపందేలు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతూనే వస్తున్నాయి. ఈ పండక్కి పతంగుల ఎగరేయటం కూడా రివాజు. పండుగ రోజుల్లో పిల్లలు గాలిపటాలు ఎగరేస్తూ బిజీగా ఉంటారు. ఇలా సంక్రాంతి పండుగ ఏడాది పొడవునా అందరికీ మధురానుభూతుల్ని మూటగడుతుంది.





చిలకలూరిపేటలో భోగి మంటను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని



హరిదాసు సందడి

తిండి వంటలు



సంక్రాంతికి తగ్గట్టే షడ్రుచుల విందు భోజనాలు తప్పనిసరి. సంప్రదాయ పిండివంటలు సంక్రాంతిలో భాగం. వారం పదిరోజుల ముందు నుంచే పిండి వంటల హడావుడి కనిపిస్తుంది. పల్లెల్లో ఎటుతిరిగి వంటకాల తయారీ బాగానే ఉంటోంది. అరిసెలు, బూరెలు, కారపూస, చెక్కలు, పూర్ణాలు, బొబ్బట్లు, లడ్లు, కజ్జికాయలు, బూంది..వంటి వంటకాలు తయారీలో ఉంటారు.

భోగి భాగ్యాలు

ఏడాది పొడవునా కష్టపడిన రైతు, పండిన పంటతో ఆనందంగా అందరితో రాజభోగాలు అనుభవించే పండు గ అయినందున దీనిని 'భోగి' అని వ్యవహరిస్తున్నారు. దక్షిణాయణంలో చివరి రోజు ఇది. పండిన పంటను పనివారు, యాచకులు, పశుపక్ష్యాదులకు వితరణ చేయటం రాజభోగం. పాత వ్యవస్థలోని చెడును మంటల్లో కాల్చి, సజీవతత్వాన్ని గ్రహించి, గుణాత్మక పరివర్తన చేయడం కోసం భోగిమంటలు. ముంగిట్లో, వీధి మలుపుల్లో వేసే భోగిమంటల్లో పాత వస్తువులను వేస్తారు. అంటే చెడును వదిలించుకుని మంచికి శ్రీకారం చుట్టటం. ఆరోగ్యం, ఆయువు, శాంతి, ఆనందం కలగటానికి ఈ పండుగ చేసుకుంటారు. సాయంత్రం చిన్న పిల్లలున్న ఇళ్లలో భోగి పళ్ల కార్యక్రమం సంప్రదాయం. రేగుపళ్లలో సౌరశక్తి ఉంటుంది. ఈ శక్తిని పిల్లలకు అందించాలని పెద్దలు తలపెట్టిన పండగ ఇది. భోగిరోజున కొన్ని ప్రాంతాల్లో కన్నెపిల్లలు గొబ్బి గౌరి వ్రతం చేస్తారు. ఇంట్లో మండపం చేసి, పళ్లు, కూరగాయలు, చెరకు గడలు, పూలతో అలంకరిస్తారు. మధ్యలో కొత్త బియ్యం పోసి బంక మట్టితో చేసిన గౌరీదేవిని ఉంచుతారు. పాలతో చేసిన పొంగలిని నైవేద్యంగా పెడతారు.

గొబ్బియల్లో.. గొబ్బియల్లో..

సంక్రాంతి పండక్కి రంగవల్లులను ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. చదువు, ఉద్యోగం, వ్యాపారాల్లో రాణిస్తూ బిజీగా ఉంటున్న ఆధునిక మహిళలు ఆచారాలకు విలువిస్తున్నారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే ప్రతి ఇంటా ముగ్గులు కొలువుదీరతాయి. ముగ్గుల్లో గొబ్బెమ్మలు తప్పనిసరి. నెలమొత్తం పెట్టిన గొబ్బెమ్మ ముద్దలను పిడకలు చేసి ఎండబెడతారు. వాటిని దండ గుచ్చి భోగిరోజు మంటల్లో వేస్తారు. సంక్రాంతిరోజు పెట్టిన గొబ్బెమ్మల్ని ఎండబెట్టి దాచి రథసప్తమి రోజు సూర్యుడి ఎదుట పెట్టి వెలిగిస్తారు. ఆ పిడకలపైనే పరమాన్నం చేసి సూర్యభగవానుడికి నైవేద్యం సమర్పిస్తారు. పిడకల్ని భోగిమంటల్లో వేస్తే పిల్లలకు దిష్టి తగలదని నమ్మకం.





పశువులకు పూజలు

సంక్రాంతి మర్నాడు కనుమ. ఏడాదంతా శ్రమించిన మూగజీవాలకు రైతులు తమ రుణం తీర్చుకునే రోజు. పశువులకు కృతజ్ఞతగా పసుపు కుంకుమలతో పూజిస్తారు. పశుపక్ష్యాదుల కోసం ఇంటి గుమ్మానికి ధాన్యం కంకులు కడతారు. వివిధ నైవేద్యాలు చేసి గ్రామదేవతలను పూజిస్తారు. కనుమకు మినుములు తినాలని నానుడి. అందుకే గారెలు చేస్తారు. ఒంటికి వేడి సమకూరుతుంది.

సంస్కృతిని కాపాడుకుందాం

- సంప్రదాయాలను గౌరవిద్దాం
- కలెక్టర్ విజయకృష్ణన్
- బాపట్లలో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు
- పాల్గొన్న జిల్లా యంత్రాంగం

బాపట్ల: మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరు గౌరవించి వాటిని భావితరాలకు అందించాలని కలెక్టర్ కె.విజయకృష్ణన్ సూచించారు. సంక్రాంతి సంబరాలు జిల్లాకేంద్రంలో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. తొలిసారిగా సంక్రాంతి పండుగ ఉత్సవాలను కలెక్టరేట్ ఆవరణలో జిల్లా యంత్రాంగం అధికారికంగా నిర్వహించింది. ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండిపై కలెక్టర్, సంయుక్త కలెక్టర్ల సంప్రదాయబద్ధంగా ప్రాంగణం వద్దకు అధికారులను తీసుకువచ్చారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జిల్లా అధికారులంతా తెలుగు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. హరిదాసుల కచేరీ, గంగిరెద్దుల రంకెలు, గాలిపటాల సందడి, చిన్నారుల కేరింతలు, మహిళల కరతాల ధ్వనులతో కలెక్టరేట్ ప్రాంగణమంతా మార్మోగింది. జిల్లా అధికారులు తమ హోదాలను మరిచి తాడాట ఆడుతూ అందరినీ మైమరపించారు. తాడాట ఆడుతున్న జిల్లా అధికారుల్లో ఉత్సాహాన్ని నింపుతూ జిల్లా కలెక్టర్ అకస్మాత్తుగా మహిళా అధికారుల బృందం వైపు నిలిచి గెలిపించడం ప్రత్యేకతను సంతరించుకున్నారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు గాలిపటాలు ఎగురవేసి అధికారులు, ప్రజల్లోనూ మరింత ఉత్సాహాన్ని నింపారు. భోగి మంటల చుట్టూ కోలాటం చేస్తున్న మహిళా కళాకారులతో కలిసి కోలాట నృత్యంలోనూ పాల్గొన్నారు. పుష్కలంగా పంటలు చేతికి వచ్చాయంటూ మహిళలు గానం చేస్తుండగా నవధాన్యాలను కలెక్టర్, ఎస్పీలు తిరగలితో విసిరి, కొత్తగా వచ్చిన ధాన్యాన్ని రోకలితో దంచి వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు. మజ్జిగ చిలికి వెన్న తీయడం, చిన్నారులకు భోగి పండ్లు పోసి ప్రత్యేకంగా దీవించారు. వ్యవసాయశాఖ, మెప్మా, మహిళా, శిశు సంక్షేమ శాఖలు ఏర్పాటు చేసిన పొంగలి తయారీని కలెక్టర్ ప్రారంభించారు. మహిళల కోలాట ప్రదర్శనతో ప్రాంగణం సందడి వాతావరణం నెలకొంది.



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, సంయుక్త కలెక్టర్ శ్రీనివాసులు



గాలిపటాలు ఎగురవేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ వకుల్ జిందాల్

సంక్రాంతి పండుగ నేపథ్యంలో రంగవల్లులు, లెమన్ అండ్ స్పూన్, తాడాట, బొంగరాలాట, మ్యూజికల్ చైర్స్ ఆటలతో కలెక్టరేట్ ప్రాంగణం ఆనందోత్సాహలతో నిండిపోయింది.

ఎంతో సంతోషాన్ని నింపింది

సంక్రాంతి పండుగ ప్రజలలో సంతోషాన్ని నింపిందని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ వెల్లడించారు. మన తెలుగు సంస్కృతి సంప్రదాయాలను విస్మరించవద్దని, అన్నం పెట్టే అన్నదాతలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. సంక్రాంతి సంబరాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగం చేసిన కృషిని ఆమె అభినందించారు. 15 సంవత్సరాల తరువాత మంచి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా జరిగే వేడుకలలో పాల్గొనడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి సంబరాలు ఎంతో సంతోషాన్ని నింపాయని సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు చెప్పారు. జిల్లాలో తొలిసారిగా సంక్రాంతి సంబరాలు జరపడం సంతోషదాయకమని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ కె.లక్ష్మీ శివజ్యోతి, బాపట్ల, చీరాల ఆర్డీఓలు జి.రవీందర్, పి.సరోజిని, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ పార్వతి పాల్గొన్నారు.

175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి



నూతలపాడులో కల్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి తదితరులు

పర్చూరు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. నూతలపాడు గ్రామంలో టీటీడీ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల నిధులతో నిర్మించనున్న టీటీడీ కల్యాణ మండపానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సభాధ్యక్షత వహించారు. వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి ఓర్వలేక దుష్టచతుష్టయంతో కలిసిన కొన్ని మీడియా సంస్థలు అసత్యప్రచారాలకు పూనుకున్నాయన్నారు. వారు చెప్పే మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. జనసేన నాయకుడు భాష బాగాలేదని, భాష మార్చుకోవాలని, ఇలాంటి వ్యక్తులు మనకు కావాలా అని ప్రశ్నించారు. మూడు ముక్కల ముఖ్యమంత్రి కాదు, మూడు ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పర్చూరు నియోజకవర్గానికి ఆమంచి కృష్ణమోహన్‌ను ఇన్‌చార్జిగా నియమించి సీఎం వైఎస్ జగన్ మంచి ఆలోచన చేశారన్నారు. రామనాథంబాబు, ఆమంచి కృష్ణమోహన్ ఇరువురూ సమన్వయంతో పనిచేసి పర్చూరు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలన్నారు. ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అమలు చేస్తుంటే కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ ప్రతిపక్షం, జనసేన పార్టీ నాయకుడు పవన్ కల్యాణ్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేడ్కర్ భావజాలంతో కూడిన పరిపాలన జరుగుతుందని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ భారతదేశంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ఆంధ్రప్రదేశ్ అన్ని రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. బాపట్ల పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రక్తంలోనే భయపడే లక్షణం లేదన్నారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గంలో పెత్తందారీ వ్యవస్థ ఉందని, ఈ వ్యవస్థ రూపుమాపడానికి సరైన లీడర్‌గా ఆమంచి కృష్ణమోహన్‌ను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారని తెలిపారు. పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని చెప్పారు. తన మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్ముకుంటే ఎవరికీ అన్యాయం జరగదని, ఆమంచి కృష్ణమోహన్ విషయంలో రుజువు చేశారని గుర్తుచేశారన్నారు. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రామనాథంబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆదేశానుసారం ఆమంచి కృష్ణమోహన్‌తో కలిసి పార్టీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సహకార మార్కెటింగ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ సమర్థవంతమైన నాయకునిగా మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్‌కు మంచి గుర్తింపు ఉందన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా ఆదిశేషు, పర్చూరు నియోజకవర్గ పరిశీలకుడు చుండూరి రవిబాబు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, కారంచేడు జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ, ఏఎంసీ చైర్మన్ జువ్వా శివరాంప్రసాద్, నూతలపాడు సర్పంచ్ చిన్నయ్య, డెయిరీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి చెంగలయ్య, పోతుల సురేష్, కళ్యాణ మండప నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాథమిక వైద్యశాల భవనం ప్రారంభం

మేదరమెట్ల: గ్రామాలను అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అద్దంకి నియోజకవర్గం కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులను శుక్రవారం దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో కలసి టీటీడీ చైర్మన్ ప్రారంభించారు. వైవీ మాట్లాడుతూ కొరిశపాడులో నిర్మించిన యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పనులు, తూర్పుపాలేనికి అందాల్సిన నష్టపరిహారాన్ని త్వరగానే పరిష్కరిస్తామని తెలిపారు. దేవదాయ శాఖ మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గాన్ని వైఎస్సార్ సీపీ కైవసం చేసుకోవాలన్నారు. ముందుగా ప్రాథమిక వైద్యశాల భవనాన్ని ప్రారంభించిన టీటీడీ చైర్మన్ సీసీ రోడ్డుకు శంకుస్థాపన, ఇంటింటి కుళాయిలకు శిలాఫలకాన్ని, సెంటర్ లైటింగ్‌ను ప్రారంభించారు. అంతకుముందు సెంటర్‌లోని దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, ప్రకాశం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యేలు బాచిన చెంచుగరటయ్య, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు వరప్రసాద్‌రెడ్డి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు, ఎంపీపీ ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ వెంకటరమణ, సర్పంచ్ ఎలిశమ్మ, మాజీ సర్పంచ్‌లు జజ్జర ఆనందరావు, పేరం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భాగ్యాలను తేవాలి : మంత్రి రజిని



చిలకలూరిపేట: జిల్లా ప్రజానీకానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి లోగిళ్లలో భోగి పండగ భాగ్యాలను తేవాలని ఆకాంక్షించారు. సంక్రాంతి నాడు అందరి ఇంటా సంక్రాంతి లక్ష్మీదేవి సిరులు కురిపించాలని కోరారు. కనుమ రోజు మూగజీవాలకు పూజలతో కర్షకులు పాడి పంటలతో తులతూగాలని శుభాశీస్సులు అందజేశారు.

ఉత్సాహభరితంగా జాతీయస్థాయి ఎడ్ల పోటీలు

పర్చూరు: జాతీయస్థాయి ఒంగోలు జాతి గిత్తల బలప్రదర్శన పోటీలు శుక్రవారం ఉత్సాహభరితంగా సాగాయి. మండలంలోని అన్నంభొట్లవారిపాలెం గ్రామంలో గోరంట్ల రత్తయ్యచౌదరి ప్రాంగణంలో పోటీలు నిర్వహిస్తున్నారు. పోలురాధ జూనియర్స్ విభాగంలో మొత్తం 22 జతలు పాల్గొనగా బాపట్ల జిల్లా సుబ్బారెడ్డిపాలేనికి చెందిన సుబ్బారెడ్డి ఎడ్ల జత నిర్ణీత సమయంలో 2,559.1 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి గెల్చుకుంది. చీరాల మండలం పాత చీరాలకు చెందిన ఎస్ఎస్ రెడ్డి బుల్స్ ఎడ్ల జత 2503 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి, బాపట్ల జిల్లా సీతానగరానికి చెందిన ముద్దనబోయిన నాగశాంతి ఎడ్ల జత 2400 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతి గెల్చుకుంది. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం, కొత్తపాలేనికి చెందిన మున్నం రుద్రమహేందర్‌రెడ్డి, కూనపురెడ్డి వెంకట సుబ్బయ్య ఎడ్ల జతలు సంయుక్తంగా 2399.9 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిని గెల్చుకున్నాయి. చీరాలకు చెందిన గంజి హేమంత్ ఎడ్లజత 2378.9 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని గెల్చుకుంది. అలాగే వేటపాలేనికి చెందిన దేవరపల్లి జాన్వికారెడ్డి ఎడ్లజత 2348 .9 అడుగుల దూరం లాగి ఆరో బహుమతి గెల్చుకుంది. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం కొత్తమాజేరుకు చెందిన తుమ్మల కోటయ్య మెమోరియల్ ఎడ్లు 2337.9 అడుగుల దూరం లాగి ఏడో స్థానంలో నిలిచాయి.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI — SAKSHI DIGITAL MEDIA GROUP

SPL — SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

APMDC — APMDC FOUNDATION

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

97030 13015, 99126 71555

District sponsor

VIVA THE SCHOOL BY VVIT

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



తెలుగు పండితులు వృషాద్రిపతిని సత్కరిస్తున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీక అని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. రేపల్లె మండలం పెనుమూడి జాతీయ రహదారి పక్కన జరుగుతున్న సంక్రాంతి సంబరాలలో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని వివిధ రంగాలలో ప్రముఖులైన మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, తెలుగు పండితులు మొవ్వా వృషాద్రిపతి, స్వాతంత్ర్యోద్యమకారుడు మోదుగుల పాపిరెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ మేడికొండ ప్రభాకరరావు, పొగాకు వ్యాపారవేత్త పోలిశెట్టి శ్యామ్‌సుందర్, డాక్టర్ పి.శ్రీనివాసరావు, బాలకోటేశ్వరరావు, మద్దిసాని నారాయణ, కనగాల విద్యాసంస్థల అధినేత అబ్దుల్ సమ్మద్‌లను సత్కరించారు. ట్రాక్టర్ రివర్స్‌పోటీలు, గొర్రెపొట్టేళ్ళ పందెపు పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, ఎంపీటీసీ మేడికొండ సుధాకరచంద్రహాసరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


పశ్చిమగోదావరి జిల్లా వద్దిపర్రులో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాపవరంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న మంత్రి చెల్లుబోయిన

గడప గడపకు మన ప్రభుత్వం


ప్రకాశం జిల్లా గిద్దలూరులో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు


కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని 4వ వార్డులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే వై సాయిప్రసాద్‌రెడ్డి

మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్య కన్నుమూత


కేపీ రెడ్డయ్య భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్ (ఇన్‌సెట్‌లో) ఎమ్మెల్యే పార్థసారధి, ఆయన తల్లిని పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి

- పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారధి తండ్రి రెడ్డయ్య
- నివాళులర్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి,అమరావతి/పెనమలూరు: మచిలీపట్నం మాజీ ఎంపీ, ఉయ్యూరు మాజీ ఎమ్మెల్యే, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తండ్రి కొలుసు పెదరెడ్డయ్య యాదవ్ (80) శుక్రవారం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున విజయవాడలోని ఇంట్లోనే తుదిశ్వాస వదిలారు. రెడ్డయ్య మరణవార్త తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ బందరు రోడ్డులోని ఆయన ఇంటికి చేరుకొని, భౌతిక కాయానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యే పార్థసారథితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, మంత్రులు జోగి రమేష్, కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్ యాదవ్, కొడాలి నాని, సింహాద్రి రమేష్, గద్దె రామమోహన్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, వైఎస్సార్‌సీపీ నేతలు దేవినేని అవినాష్, బొప్పన భవకుమార్ తదితరులు రెడ్డయ్య భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రెడ్డయ్య భౌతిక కాయాన్ని విజయవాడ నుంచి స్వగ్రామం కరకంపాడుకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

1983లో రాజకీయాల్లోకి

కేపీ రెడ్డయ్య 1942లో కృష్ణా జిల్లా కరకంపాడులో జన్మించారు. 1962లో సామ్రాజ్యాన్ని వివాహం చేసుకున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు కొలుసు పార్థసారథి, సురేష్‌బాబు, కృష్ణకాంత్ ఉన్నారు. బీటెక్ చదివిన రెడ్డయ్య కొంతకాలం విద్యుత్ శాఖలో ఏఈగా పని చేశారు. 1983లో రాజకీయ అరంగేట్రం చేసి ఉయ్యూరు ఎమ్మెల్యేగా గెలిచారు. 1985 నుంచి 1991 వరకు అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడిగా పని చేశారు. 1991లో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడిగా గెలిచారు. అనేక పదవులు నిర్వహించారు. రెడ్డయ్య మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుకు సన్నిహితుడు. రెడ్డయ్య రాజకీయ వారసుడిగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రిగా కూడా పని చేశారు.

ఫిబ్రవరిలో సచివాలయ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్



దాదాపు 14,523 ఖాళీలు ఉన్నట్టు అంచనా
- మూడు నెలల్లో భర్తీ ప్రక్రియ పూర్తి చేసే అవకాశం
- ఖాళీల వివరాలు పంపాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఫిబ్రవరిలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయనుంది. ప్రాథమిక సమాచారం మేరకు.. మొత్తం 20 కేటగిరీల్లో దాదాపు 14,523 పోస్టులను భర్తీ చేస్తారని తెలుస్తోంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రికార్డు స్థాయిలో 1.34 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన సంగతి తెలిసిందే. పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా కేవలం నాలుగు నెలల్లోనే ప్రభుత్వం ముగించింది. అప్పట్లో మిగిలిన ఖాళీలకు 2020లో రెండో విడత నోటిఫికేషన్ ఇచ్చి పోస్టులను భర్తీ చేసింది. ఆ తర్వాత వివిధ కారణాలతో భర్తీ కాకుండా మిగిలిపోయిన పోస్టుల భర్తీకి ఇప్పుడు మూడో విడత నోటిఫికేషన్ జారీ ప్రక్రియను మొదలు పెట్టింది.

ఏప్రిల్‌లోపు రాత పరీక్షలు పూర్తి చేసే అవకాశం..

ఈ ఏడాది ఏప్రిల్‌లోపే మూడో విడత నోటిఫికేషన్‌కు సంబంధించిన రాతపరీక్షలు కూడా నిర్వహించాలనే యోచనలో అధికారులు ఉన్నారు. ఈసారి కూడా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోనే రాతపరీక్షలతో సహా మొత్తం భర్తీ ప్రక్రియను చేపడతారు. ఈ మేరకు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయ శాఖ గత సోమవారం పంచాయతీరాజ్ శాఖకు లేఖ కూడా రాసింది. అలాగే ఏయే శాఖల్లో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయనే వివరాలను కూడా ఆ లేఖలో పేర్కొంది. ప్రస్తుతం ఎనర్జీ అసిస్టెంట్ సహా మొత్తం 20 కేటగిరీల ఉద్యోగులు గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్నారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, మునిసిపల్, వ్యవసాయ, పశు సంవర్ధక, సాంఘిక సంక్షేమ, ఉద్యానవన, సెరికల్చర్, ఫిషరీస్, వైద్య, ఆరోగ్య, హోం శాఖల పర్యవేక్షణలో ఆయా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ కూడా కేటగిరీల వారీగా ఉన్న ఉద్యోగ ఖాళీల వివరాలను మరోసారి పరిశీలించుకునేందుకు ఆయా శాఖల విభాగాధిపతుల నుంచి సమాచారం వేరుగా తెప్పించుకుంటోంది. మొత్తం మూడు నెలల వ్యవధిలోనే ఈ ఉద్యోగాల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు వెల్లడించారు.


ప్రాథమిక సమాచారం మేరకు కేటగిరీల వారీగా ఉద్యోగ ఖాళీలు..

కేటగిరీ	ఖాళీలు
గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు	182
డిజిటల్ అసిస్టెంట్	736
వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్	578
విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్	467
హార్టికల్చర్ అసిస్టెంట్	1,005
సెరికల్చర్ అసిస్టెంట్	23
పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్	4,765
ఫిషరీస్ అసిస్టెంట్	60
ఇంజనీరింగ్ అసిస్టెంట్	982
వీఆర్‌వో గ్రేడ్-2 లేదా వార్డు రెవెన్యూ సెక్రటరీ	112
విలేజ్ సర్వేయర్ అసిస్టెంట్	990
వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ	170
వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ	197
వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ	153
వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ	371
వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ	436
వార్డు ఎమినిటీస్ సెక్రటరీ	459
ఏఎన్‌ఎం లేదా వార్డు హెల్త్ సెక్రటరీ	618
మహిళా పోలీసు లేదా వార్డు ఉమెన్ అండ్ వీకర్ సెక్షన్స్ ప్రొటెక్షన్ సెక్రటరీ	1,092
ఎనర్జీ అసిస్టెంట్	1,127
మొత్తం	14,523

(నోట్: ఎనర్జీ అసిస్టెంట్ ఉద్యోగాలకు మిగిలిన ఉద్యోగాల నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా మరొక నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది)

షార్‌లో పీఐఎఫ్ భవన నిర్మాణం పూర్తి

- మొదటి ప్రయోగవేదికకు అనుసంధానం
- విజయవంతంగా ట్రయల్ రన్
- షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ వెల్లడి


పీఎస్‌ఎల్‌వీ రాకెట్ మొదటి దశ

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు వాణిజ్యపరంగా ప్రపంచ దేశాల నుంచి మంచి డిమాండ్ ఉండడంతో పీఎస్‌ఎల్‌వీ రాకెట్ ప్రయోగాలను పెంచడం కోసం సతీష్ ధవన్ స్పేస్ సెంటర్(షార్)లోని మొదటి ప్రయోగవేదికకు అనుసంధానంగా చేపట్టిన పీఎస్‌ఎల్‌వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ (పీఐఎఫ్) భవన నిర్మాణం పూర్తయింది. ఇక్కడ ట్రయల్ రన్‌ను శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. దీనివల్ల భవిష్యత్‌లో పీఎస్‌ఎల్‌వీ రాకెట్లను ఎక్కువగా ప్రయోగించే అవకాశం ఉంటుందని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తెలిపారు. ఇక నుంచి మొదటి ప్రయోగవేదికపై ఒకేసారి రెండు రాకెట్లను అనుసంధానం చేసుకునే సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. రాకెట్ కేంద్రాలు లేని దేశాలకు చెందినవారు ఉపగ్రహాలను నిర్మించుకుని భారత్‌కు వచ్చి మన రాకెట్ల ద్వారా వాటిని ప్రయోగించుకుని వెళుతున్నవారి సంఖ్య పెరుగుతోందన్నారు. దీంతో వాణిజ్యపరంగా ప్రయోగాలు పెరుగుతున్న దృష్ట్యా భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పీఎస్‌ఎల్‌వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ భవనాన్ని నిర్మించామని వివరించారు. ఈ ఏడాది ప్రయోగాల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం షార్‌లో ప్రపంచ స్థాయి రాకెట్ ప్రయోగాలకు అవసరమయ్యే సౌకర్యాలన్నీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

జిల్లా వార్తలు

కృషి విజ్ఞాన కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

గుంటూరు రూరల్: రాబోవు సంవత్సరంలో రైతులు పంటలు బాగా పండి సుఖసంతోషాలతో జీవించాలని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. లాంఫాంలో కేవీకేలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు వేసి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ సంవత్సరం సహజ వ్యవసాయ పద్ధతులు, పెరటి కోళ్ల పెంపకం, 2023 సంవత్సరం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులు, సాగు మెలకువలు గురించి రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది డాక్టర్ ఎం.గంగాదేవి, డాక్టర్ ఎం.దీప, డాక్టర్ సీహెచ్ అనిల్‌కుమార్, డాక్టర్ అర్చన పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా కంటి స్క్రీనింగ్ పరీక్షలు

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు ఇవ్వటం, ఆపరేషన్లు చేయించటం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్ ఆయా జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వైద్యాధికారులతో కంటి పరీక్షల స్క్రీనింగ్ క్యాంపులపై ఆయన మాట్లాడారు. మార్చి నాటికి అందరికి కంటి స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల ప్రకారం జిల్లాలోని ప్రజలందరికి కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ, కంటి ఆపరేషన్లు చేయిస్తామని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ జె. హనుమంతరావు తెలిపారు.

20 మందితో రాష్ట్ర జట్టు ఏర్పాటు

మచిలీపట్నం టౌన్: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత ఐదురోజులుగా స్థానిక ఆంధ్ర జాతీయ కళాశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 22 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఫైనల్స్‌కు విశాఖపట్నం - కర్నూలు జిల్లాల తలపడగా కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ ముగియటంతో రాష్ట్ర జట్టును నిర్వాహకులు ఎంపిక చేశారు. అన్ని జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులు 20 మందితో జట్టును ఎంపిక చేశారు. ఈ టీమ్ జాతీయస్థాయిలో జరిగే క్రికెట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ఆడనుంది. ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గో స్థానాల్లో నిలిచిన జట్లకు వైఎస్సార్ సీపీ నగర నాయకుడు బందెల థామస్ నోబుల్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా సంయుక్త కార్యదర్శి తోట అజయ్‌కుమార్, టోర్నమెంట్ పరిశీలకుడు వి. యోగేశ్వర్, కోచ్ తాతయ్య ట్రోఫీలను, జ్ఞాపికలను అందజేశారు.

నరసరావుపేటలో అట్టహాసంగా సంక్రాంతి సంబరాలు


జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి. పక్కన కలెక్టర్ శివశంకర్


కోటప్పకొండ శివైక నృత్యాన్ని ప్రదర్శిస్తున్న నృత్య కళాకారులు

నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో శుక్రవారం సాయంత్రం సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పట్టణంలోని డి.ఎస్.ఏ. స్టేడియంలో వేడుకలను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వేడుకలను అట్టహాసంగా ప్రారంభించి సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. డీఎస్ఏ స్టేడియం అంతా ప్రేక్షకులతో నిండిపోయింది. స్థానిక ప్రతిభావంతులు ప్రదర్శనలు అందర్నీ విశేషంగా ఆకట్టుకున్నాయి. కోటప్పకొండ శివైక నృత్యం, అర్వపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ విలువిద్యాకారుడు లింగంగుంట్ల సుబ్బారావు ప్రదర్శన సభికులను సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తింది. జబర్దస్త్ టీం బుల్లెట్ భాస్కర్, జీవన్, శాంతి స్వరూప్, నాటీ నరేష్, జితేందర్, కేపీ పాల్ రాము, యాంకర్ దివ్య, జీఎంఆర్, ప్రత్యేక నృత్యం విజయ్‌లు నిర్వహించిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్టేడియం మొత్తం విద్యుత్ వెలుగులతో కాంతులీనింది. పెద్ద ఎత్తున ప్రజలు స్టేడియంలో జరిగిన వేడుకలను తిలకించేందుకు, కుటుంబ సభ్యులతో కలసి రావడంతో సంతోష వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో నృత్య ప్రదర్శనలతో అలరించి ప్రతిభ చూపిన వారిని అభినందించి సత్కరించారు. కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, శ్రీ నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి పర్యవేక్షించగా స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఘరానా దొంగలు అరెస్ట్

- రూ. 60 లక్షల విలువచేసే బంగారం, వెండి వస్తువులు స్వాధీనం
- భారీ దొంగతనం కేసును ఛేదించిన జిల్లా పోలీసులు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: జిల్లాలోనే సంచలనం కలిగించిన భారీ దొంగతనం కేసును ఎట్టకేలకు జిల్లా పోలీసులు ఛేదించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వివరాలను వెల్లడించారు. చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన కొండముడుగుల వెంకట రమణారెడ్డి ఇంట్లో నిద్రిస్తుండగా 2022 నవంబర్ 9 తెల్లవారుజామున కృష్ణా జిల్లా ఘంటసాల మండల కేంద్రానికి చెందిన తాతా ప్రసాద్ అలియాస్ మామిళ్లపల్లి శశికాంత్, బాపట్ల మండలం చినబేతపూడి గ్రామానికి చెందిన దేవర అబ్బన్న అలియాస్ వర్మలు ఇంటితాళం, బీరువాతాళం పగలకొట్టి గుట్టుచప్పుడు కాకుండా బీరువాలోని 1.5 కిలోల బంగారం, వెండి వస్తువులు తీసుకెళ్లారు.

రూ.60 లక్షల సొత్తు రికవరీ

నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి హారాలు-2, నక్లెస్‌లు-6, నల్లపూసల హారాలు -2, బ్రాస్‌లైట్‌లు-2, ఉంగరాలు-11, పెద్ద హారం-1, నాలుగుపెట్ల గొలుసు-1, పచ్చలహారం -1, ఒక కేజి వెండి వస్తువులు, దొంగిలించిన సొత్తుతో పాటు తాతా ప్రసాద్ గుంటూరుజిల్లా కొల్లిపర మండలం బొమ్మువానిపాలెంలో తన భార్యపేరుతో రూ. 18 లక్షలతో రిజిస్ట్రేషన్ చేయించిన ఇంటి తాలుకా దస్తావేజులు, దేవర అబ్బన్న వద్దనుంచి రూ. 2 లక్షల నగదుతోపాటు నిందితులు గతంలో గన్నవరం, నెల్లూరు సమీప ప్రాంతాల్లో దొంగిలించిన మూడు రాయల్‌ఇన్‌ఫీల్డ్ బుల్లెట్ వాహనాలు, కారును స్వాధీనం చేసుకున్నారు.

కేసును ఛేదించిన పోలీసులకు అభినందనలు

భారీ దొంగతనం కేసును త్వరితగతిన ఛేదించాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణను ఆదేశించడంతో జిల్లా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్, చుండూరు సర్కిల్ సీఐల ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక బృందాలుగా మోదుకూరు గ్రామానికి చుట్టుపక్కల ఏర్పాటుచేసిన సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. కేసును ఛేదించడంలో కృషిచేసిన రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ, చుండూరు సీఐ బి.కళ్యాణరాజు, సీసీఎస్ సీఐ ఎం. మురళీకృష్ణ, చుండూరు ఎస్ఐ జి.నవీన్‌కుమార్, సీసీఎస్ ఎస్ఐ కె.కమలాకర్, చుండూరు ఏఎస్ఐ రాజ్‌కుమార్; హెడ్‌కానిస్టేబుళ్లు జి.ప్రసాద్, టి.సూర్యప్రకాష్, కానిస్టేబుళ్లు బి.వాసు, ఎన్.వెంకటేశ్వరరావు, ఎన్.గోపీకృష్ణలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. విలేకరుల సమావేశంలో రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఏఎన్‌యూ జట్టు


జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు అర్హత సాధించిన ఏఎన్‌యూ ఖోఖో జట్టు సభ్యులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పురుషుల ఖోఖో జట్టు జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలకు అర్హత సాధించింది. కాకినాడ జేఎన్‌టీయూలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన సౌత్‌జోన్ పురుషుల ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఏఎన్‌యూ జట్టు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడంతో పాటు, సౌత్ జోన్ రెండో బహుమతి సాధించింది. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన ఏఎన్‌యూ ఖోఖో జట్టు వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పి.జాన్సన్, ప్రిన్సిపాల్ ఆచార్య పి.పి.ఎస్. పాల్‌కుమార్, యోగ కోచ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.సూర్యనారాయణ అభినందనలు తెలిపారు.

పేదలకు నాణ్యమైన వైద్యసేవలే లక్ష్యం

ఎన్‌హెచ్‌ఎం స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి


గణపతినగర్ యూపీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి

మంగళగిరి: పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే యూపీహెచ్‌సీల లక్ష్యమని నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. నగరంలోని గణపతినగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారు హెల్త్ సెంటర్‌లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ల్యాబ్ టెస్ట్‌లు, మందులు తదితర విషయాల గురించి హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ అనూషను అడిగి తెలుసుకున్నారు. నోడల్ అధికారిణి డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పట్టణ ఆరోగ్యకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెల్త్ సెంటర్‌ను నేషనల్ క్వాలిటీ అసెస్మెంట్ స్టాండర్డ్ ప్రకారం పూర్తిగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించడానికి హెల్త్ సెంటర్‌లో ఆర్థో, జనరల్ సర్జన్ సేవలు అందుబాటులో ఉన్నాయని, అల్ట్రా సౌండ్ టెస్ట్ సదుపాయం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హెల్త్ సెంటర్‌లో వైద్యులు సేవలు అందిస్తున్నారని, ప్రజలు వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వెంకట రవికిరణ్, ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ ఆలా హేమంత్, జనరల్ సర్జన్ డాక్టర్ పి.ప్రభాకర్, సూపర్‌వైజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

దోపిడీ.. కట్టడి!

- సాక్షి కథనానికి స్పందన
- విస్తృత తనిఖీలు చేపట్టిన ఎంవీఐలు
- 77 కేసులు నమోదు చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

పట్నంబజారు: 'సంక్రాంతి దోపిడి' కథనానికి ఆర్టీవో అధికారులు స్పందించారు. గురువారం సాక్షి జిల్లా అనుబంధంలో వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేయటంతో పాటు, నిబంధనలు పాటించని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై అధికారులు కొరడా ఝుళిపించారు. గుంటూరు చుట్టుగుంట, ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఏక కాలంలో దాడులు నిర్వహించారు. అధిక చార్జీలు వసూలు చేస్తున్న ఏడు బస్సులు, సరుకు రవాణా 43, ప్రయాణికుల జాబితా లేనివి 14తో పాటు మొత్తం 77 కేసులు నమోదు చేశారు. ఈ మేరకు తనిఖీలు మరింత ముమ్మరం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.


తనిఖీలు నిర్వహిస్తున్న రవాణా శాఖ అధికారులు